సాక్షి
పల్నాడు
శుక్రవారం । 2 । మే । 2025



4న నాగేంద్రస్వామి తిరునాళ్ల

రెంటచింతల: గోలి గ్రామ శివారులోని నాగేంద్రస్వామి దేవస్థానం తిరునాళ్ల ఆదివారం నిర్వహిస్తున్నట్టు అర్చకుడు కేశవరావు గురువారం తెలిపారు.



వరసిద్ధి వినాయక వార్షికోత్సవం

ఫిరంగిపురం: యర్రగుంట్లపాడులోని వరసిద్ధి వినాయకస్వామి ఆలయ 19వ వార్షికోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు.భక్తులకు అన్నప్రసాద వితరణ కావించారు.

మామిడి పండ్లతో ఆంజనేయుడికి పూజలు



సత్తెనపల్లి: నాగన్నకుంటలోని కార్యసిద్ధి ఆంజనేయ స్వామి ఆలయ 11వ వార్షికోత్సవం సందర్భంగా స్వామి వారిని గురువారం మామిడిపండ్లతో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

నేడు ప్రాధాన్యత క్రమంలో ఉపాధ్యాయులు హాజరు కావాలి

గుంటూరు ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియలో భాగంగా ప్రాధాన్యత క్రమంతో పాటు శారీరక వైకల్య కేటగిరీలో పాయింట్లు పొందుటకు అర్హత కలిగి, ఇటీవల జీజీహెచ్ మెడికల్ బోర్డులో నిర్వహించిన నిర్ధారణ పరీక్షల్లో న్యాయం జరగలేదని భావించే ఉపాధ్యాయులు శుక్రవారం ఉదయం 10 గంటలకు జిల్లాకోర్టు ఎదుట ఉన్న ఏపీ టీఎఫ్ జిల్లా కార్యాలయంలో హాజరు కావాలని అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నిజమైన అర్హతలు కలిగిన ఉపాధ్యాయులు పాత, కొత్త మెడికల్ సర్టిఫికెట్లతో రావాలని సూచించారు. ఇతర వివరాలకు 99497 47464, 89192 50950, 77022 98003, 99487 49115 నంబర్లలో సంప్రదించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె. బసవ లింగారావు తెలిపారు.

వాటర్ సప్లయ్ సబ్‌డివిజన్ డీఈగా మనోహర్



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ విజయపురి సౌత్ కాలనీ వాటర్ సప్లయ్ సీవరేజ్ సబ్ డివిజన్ డీఈగా జి.మనోహర్ బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇప్పటి వరకు నెల్లూరులోని తెలుగుగంగ ప్రాజెక్ట్ ఏఈఈగా పనిచేశారు. పదోన్నతిపై నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ కాలనీకి డీఈగా వచ్చారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మనోహర్ బాబు ను డీఈ మురళీధర్, ఏఈఈ హిమబిందు తదితరులు అభినందించారు.

వారాహి దివ్య అలంకరణలో బగళాముఖి అమ్మవారు



చందోలు(కర్లపాలెం): బగళాముఖి అమ్మవారి కొలుపులలో రెండో రోజు కిరాత రూప వారాహి దివ్య అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి వార్షిక తిరునాళ్ల మహోత్సవంలో భాగంగా జరుగుతున్న కొలుపులలో గురువారం చెరుకుపల్లి మండలం కుంచలవారిపాలెం గ్రామానికి చెందిన గ్రామపెద్దలు చెంచురెడ్డి, రవిచంద్రారెడ్డి కుటుంబ సమేతంగా అమ్మవారి ఆలయానికి వచ్చి బగళాముఖి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పూజారులు, 16మంది సభ్యులు భక్తిశ్రద్ధలతో బగళాముఖి అమ్మవారి పావనం, ఘటములను శిరస్సున ధరించి మంగళవాయిద్యాలతో తమ గ్రామంలోనికి తీసుకువెళ్లి ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలోని భక్తులు అమ్మవారి పావనం, ఘటములకు పసుపు, కుంకుమలతో పూజలు చేసి హారతులిచ్చారు.

దుర్గమ్మ నిత్యాన్నదానానికి విరాళాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి భక్తులు విరాళాలు అందజేస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన జి.నాగకుమారి కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఆలయ అధికారులను కలిసి రూ. లక్ష విరాళాన్ని అన్నదానానికి అందజేశారు. చెన్నైకి చెందిన డి.ఫణీంద్రరావు కుటుంబం ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ. 1,00,116 విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

కార్తికేయుని సన్నిధిలో ప్రత్యేక పూజలు



మోపిదేవి: శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ వెల్ఫేర్ కమిషనర్ శ్రీరామ సత్యనారాయణ గురువారం దర్శించుకున్నారు. ఆయన ప్రత్యేక పూజలు చేశారు.

యానిమేషన్ షాక్ !

అనుకున్నంత అయ్యింది.. ఎన్నో ఆశలతో, మరెన్నో ఊహలతో పెట్టుబడులు పెట్టిన వందల మంది గుండెలు ముక్కలయ్యాయి. యానిమేషన్ మాయ చేసి రంగుల ప్రపంచం చూపించిన కిరణ్ తాను తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వలేనంటూ ఐపీ పెట్టేశాడు. రూపాయి రూపాయి కూడబెట్టి, ఆశల అప్పులు మూటకట్టుకొని ఈ యానిమేషన్ రంగంలో పెట్టుబడులు పెట్టిన వందల మంది ఏం చేయాలో దిక్కుతోచక ఒంటరిగా మిగిలారు. కూటమి ప్రభుత్వంలో న్యాయం జరగదంటూ తమకు దిక్కెవరంటూ బాధితుల గుండెలు బాదుకుంటూ రోదిస్తున్నారు.

- ఐపీ దాఖలు చేసిన యూపిక్స్ యానిమేషన్ అధినేత
- రూ.156 కోట్లకు దివాలా తీసినట్టు 102 మందికి నోటీసులు
- బాధితుల్లో అధిక శాతం నరసరావుపేట వాసులే
- రెండు తెలుగురాష్ట్రాల్లో రూ.1,000 కోట్లకు పైగా స్కాం
- బాధితులు పెట్టిన బ్లాక్‌మనీని ఐపీలో చూపని కిరణ్



బాధితులకు కిరణ్ తరపు న్యాయవాది పంపిన ఐపీ నోటీసు

నరసరావుపేటటౌన్: యానిమేషన్ బాధితులకు నిర్వాహకుడు కిరణ్ షాక్ ఇచ్చాడు. అధిక వడ్డీ ఆశ చూపి పెట్టుబడిదారుల వద్ద నుంచి రూ.కోట్లు వసూలు చేసిన యూపిక్స్ అధినేత కిరణ్ నెల రోజుల క్రితం అజ్ఞాతంలోకి వెళ్లిన విషయం విదితమే. రూ.కోట్లు చెల్లించిన బాధితుల్లో ఒకరు నరసరావుపేటకు చెందిన వ్యాపారి గుండా నాగేశ్వరరావు మనోవేదన చెంది వారం క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. మరికొందరు బాధితులు చెల్లించిన డబ్బులు తిరిగి వస్తాయో లేవో నన్న ఆందోళనలో ఉన్నారు. ఈ క్రమంలో యానిమేషన్ నిర్వాహకుడు తాను దివాళా తీసినట్టు నోటీసులు పంపించాడు. సుమారు 102 మంది పెట్టుబడిదారులకు రూ.156 కోట్లకు ఐపీ దాఖలు చేస్తూ తన న్యాయవాది ద్వారా బాధితులకు గురువారం నోటీసులు అందించాడు. దీంతో బాధితులకు కోలుకోలేని దెబ్బ తగిలింది.

పేట వాసులే అధికం...

యానిమేషన్ స్కాం బాధితులను పరిశీలిస్తే నరసరావుపేటకు చెందిన వారే అధికంగా ఉన్నారు. రూ.156 కోట్లలో 70 శాతం సొమ్ము నరసరావుపేట వాసులదే. నమ్మకంగా వ్యాపారం చేస్తూ అధిక వడ్డీ ఆశ చూపడంతో స్తోమతకు మించి పెట్టుబడులు పెట్టారు. కొంతమంది ఉన్న ఆస్తులను సైతం విక్రయించగా, మరికొంతమంది వడ్డీలకు తెచ్చి మరి పెట్టుబడులు పెట్టారు. ఉన్న ఆస్తులు విక్రయించినా అప్పులు చెల్లించలేని పరిస్థితుల్లో కొందరు కొట్టుమిట్టాడుతున్నారు. పెట్టుబడిదారులు తెచ్చిన డబ్బులకు వడ్డీలు చెల్లిస్తూ కాలయాపన చేస్తున్నారు. కిరణ్ ఐపీతో ఇక డబ్బులు రావని తెలుసుకున్న అప్పులిచ్చిన వారు బాధితులపై ఒత్తిడి తెస్తున్నారు.

ఐపీలో చూపిందే కొంతే...

యానిమేషన్ స్కాం మొత్తం రూ.1,000 కోట్ల పై చిలుకు ఉంటుందని బాధితులు చెప్పుకొస్తున్నారు. ఒక్క నరసరావుపేటలోనే 200 మందికి పైగా బాధితులుండగా వారి నుంచి సుమారు రూ.400 కోట్లు వసూలు చేసినట్టు తెలుస్తోంది. రెండు తెలుగు రాష్ట్రాలలో అనేకమంది బాధితులు డిపాజిట్లు చేశారు. విజయవాడ, హైదరాబాద్ కేంద్రంగా కార్యాలయాలను ఏర్పాటు చేసి మధ్యవర్తుల ద్వారా రూ.కోట్లలో పెట్టుబడులను కిరణ్ స్వీకరించారు. ఐతే అకౌంట్లలో జమ అయిన మొత్తానికి మాత్రమే ఐపీలో చూపించాడు. లెక్కల్లో చూపని డబ్బు(బ్లాక్ మనీ) ఐపీ నోటీసులో చూపించలేదని కొంతమంది బాధితులు చెప్పుకొస్తున్నారు. ఏడు నెలలుగా చెల్లింపులు మొత్తం పూర్తిగా నిలిపివేశాడు. అయినప్పటికీ అమెరికాలో నూతన ప్రాజెక్టు వచ్చిందని సన్మానాలు చేయించుకొని పెట్టుబడిదారులను ఆకర్షించాడు. అధిక వడ్డీ ఆశచూపించి నాలుగైదు నెలల వ్యవధిలో రూ.కోట్లు వసూలు చేశాడు. చివరకు బోర్డు తిప్పేశాడు.

తన వద్ద ఉన్నది రూ.2.72 కోట్లేనట..!

రూ.156 కోట్లకు ఐపీ దాఖలు చేసిన కిరణ్ తన వద్ద సుమారు రూ.2.72 కోట్ల విలువైన వస్తువులే ఉన్నట్టు ఐపీలో చూపించాడు. ఈ వ్యవహారం చూస్తుంటే ముందుగానే ఐపీ పెట్టేందుకు ప్రణాళిక రచించినట్టు అర్థమవుతోంది. యూపిక్స్ యానిమేషన్ కార్యాలయాల్లో ఉన్న కంప్యూటర్లు, ఫ్యాన్లు, టీవీలు, సీలు, ఇతర ఫర్నీచర్ ఆస్తిగా చూపించాడు. ఇందులో 70 కంప్యూటర్ల విలువ రూ.2.5 కోట్లుగా చూపించడం కొసమెరుపు.

అజ్ఞాతంలోకి వెళ్లినా మాయే...

పెట్టుబడి పెడితే ఏడాదిలో రూపాయికి రూపాయి ఇస్తానని నమ్మించిన కిరణ్ ఏడు నెలలుగా డిపాజిట్‌దారులకు డబ్బు చెల్లించకపోవడంతో ఒత్తిడి తెచ్చారు. అజ్ఞాతంలోకి వెళ్లిన కిరణ్ వీడియో సందేశాన్ని విడుదల చేశాడు. ఇందులో అందరికీ త్వరలోనే డబ్బులు చెల్లిస్తానని ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదంటూ హామీ ఇచ్చాడు. దీంతో పాటు కొందరి ఫోన్లకు స్పందించి మాయమాటలు చెప్పాడు. త్వరలోనే పెద్ద మొత్తంలో నగదు వస్తుందని అనుకున్నదానికంటే కూడా ఎక్కువ మొత్తంలో తిరిగి ఇచ్చేస్తానని నమ్మబలికాడు. అతని మాటలతో బాధితులు పోలీసు స్టేషన్లకు వెళ్లేందుకు సైతం వెనుకాడారు. పోలీసులకు ఫిర్యాదుచేస్తే ఆవంక చూపి తమ డబ్బులు ఇవ్వడేమోనని మిన్నుకుండిపోయారు. ఈ సమయంలో కిరణ్ షాక్ ఇచ్చేవిధంగా ఐపీ నోటీసులు పంపాడు.



అజ్ఞాతంలోకి వెళ్లి వీడియో సందేశం ఇస్తున్న యానిమేషన్ నిర్వహకుడు కిరణ్ (ఫైల్)

ప్రధాని సభ ఏర్పాట్లు పరిశీలించిన మంత్రులు



తాడికొండ: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అమరావతికి విచ్చేస్తున్న సందర్భంగా వెలగపూడి, సచివాలయం ప్రాంతానికి దగ్గరలో ఏర్పాటు చేసిన 'అమరావతి పునఃప్రారంభం సభ' ప్రాంగణాన్ని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ గురువారం పరిశీలించారు. సభావేదిక, వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు, అతిథులు, రాజధాని కోసం భూములిచ్చిన రైతుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గ్యాలరీలు, సభాప్రాంగణంలో కూర్చునే వారందరికీ చేసిన ఏర్పాట్లు, సభకు చేరుకునే మార్గాలు, పార్కింగ్ స్థలాలు, ఆహారం, తాగునీరు, భద్రతా ఏర్పాట్లను మంత్రి పరిశీలించారు. సంబంధిత అధికారులను ఆయా అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆర్థిక మంత్రితో పాటు మంత్రులు పి.నారాయణ, నాదెండ్ల మనోహర్, కొల్లి రవీంద్ర, పలు శాఖల అధికారులు ఉన్నారు.

అమరావతి పునఃనిర్మాణం చారిత్రక ఘట్టం..

తెనాలి: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారధ్యంలో అమరావతి పునఃనిర్మాణం చారిత్రాత్మక ఘట్టం కానుందని రాష్ట్ర రవాణ, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి అన్నారు. అమరావతి పునఃనిర్మాణ పనుల ప్రారంభోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ రానున్న నేపథ్యంలో జనసమీకరణలో భాగంగా గురువారం మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి తెనాలి వచ్చారు. స్థానిక గౌతమ్ గ్రాండ్ హోటల్‌లో ఎమ్మెల్సీలు బీటీ నాయుడు, ఆలపాటి రాజేంద్రప్రసాద్‌తో కలిసి సమీక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం ఆంధ్రప్రదేశ్ ప్రజల కలగా గుర్తుచేశారు.

అభివృద్ధి ప్రదాత కాసు వెంగళరెడ్డి

ఘనంగా నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి, కాసు మహేష్‌రెడ్డి



కాసు వెంగళరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి, కాసు మహేష్‌రెడ్డి

నరసరావుపేట: సర్దార్ కాసు వెంగళరెడ్డి ఉమ్మడి గుంటూరు జిల్లా అభివృద్ధికి గుండెకాయలాగా పనిచేశారని మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కాసు మహేష్‌రెడ్డి పేర్కొన్నారు. వెంగళరెడ్డి 45వ వర్ధంతి సందర్భంగా గురువారం పల్నాడురోడ్డులోని ఎస్ఎస్ఎన్ కళాశాలకు ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ వెంగళరెడ్డి అందరి కష్టసుఖాల్లో పాలుపంచుకున్నారన్నారు. రాజ్యసభ సభ్యులుగా, శాసనసమండలి సభ్యునిగాను, డీసీసీబీ, జిల్లా పరిషత్ చైర్మన్‌గా సమర్ధవంతంగా పనిచేశారన్నారు. ఎంతోమందికి ఉద్యోగ, ఉపాధి అవవకాశాలు కల్పించారన్నారు. మాజీ మంత్రి కాసు వెంకటకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి ఆయన అడుగుజాడల్లో నడుస్తున్నారన్నారు. కాసు బ్రహ్మానందరెడ్డి ముఖ్యమంత్రిగా పనిచేసి రాష్ట్రాభివృద్ధికి విశేష కృషి చేశారన్నారు.

రాష్ట్ర చరిత్రలో చెరగని ముద్ర

కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో కాసు బ్రహ్మానందరెడ్డి, వెంగళరెడ్డి చెరగని ముద్ర వేశారన్నారు. నాగార్జునసాగర్ నిర్మాణంలో బ్రహ్మానందరెడ్డి కీలకపాత్ర పోషించి క్రస్టుగేట్లు ఏర్పాటు చేయించి గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో లక్షలాది ఎకరాలకు సాగునీరు, లక్షలమందికి తాగునీరు అందించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేశారన్నారు. వెంగళరెడ్డి జిల్లా పరిషత్ చైర్మన్‌గా జిల్లాలో అనేక ప్రాంతాల్లో స్కూళ్లు ఏర్పాటు చేయించారన్నారు. తొలుత క్యాంపు కార్యాలయంలో కాసు మహేష్‌రెడ్డి వెంగళరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవరెడ్డి, మాజీ సర్పంచ్ పొన్నపాటి ఈశ్వరరెడ్డి మాట్లాడారు. సీనియర్ నాయకుడు డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు పదముత్తం చిట్టిబాబు, పార్టీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు అన్నెం పున్నారెడ్డి, నకరికల్లు మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్యం నుంచే క్రీడాస్ఫూర్తి అలవరుచుకోవాలి

వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ప్రారంభించిన జిల్లా కలెక్టర్



శిబిరంలో క్రీడాకారులతో కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

నరసరావుపేట ఈస్ట్: జీవితంలో ఎదురయ్యే ఆటుపోట్లను అధిగమించి ఉన్నతంగా ఎదిగేందుకు క్రీడా స్ఫూర్తి దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. సత్తెనపల్లిరోడ్డులోని డీఎస్ఏ స్టేడియంలో గురువారం పల్నాడుజిల్లా వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుతో కలసి ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ, ఆటల్లో గెలుపు, ఓటములు సహజమని, ఓటమిని విజయానికి మెట్టుగా చేసుకొని విజయం సాధించాలని తెలిపారు. చిన్నతనం నుంచే క్రీడా స్ఫూర్తిని అలవరచుకోవటం ద్వారా ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చని వివరించారు. వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను ప్రారంభించిన అనంతరం కలెక్టర్ అరుణ్ బాబు, ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు కొద్దిసేపు చిన్నారులతో కలసి బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, క్రికెట్ ఆడి వారిలో ఉత్సాహాన్ని నింపారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పి.నరసింహారెడ్డి మాట్లాడుతూ, జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో 18 క్రీడాంశాలలో 50 క్రీడా శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. శిక్షణ అనంతరం శిబిరంలో పాల్గొన్న బాల బాలికలకు క్రీడా ధ్రువీకరణ పత్రాలు అందిస్తామన్నారు. ఆయా క్రీడాంశాల కోచ్‌లు, పీఈటీలు, పీడీలు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

తొలగని వసతి గ్రహణం

జేఎన్‌టీయూఎన్‌లో నిలిచిన వసతి గృహ నిర్మాణాలు

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ.32కోట్లతో భవనాల నిర్మాణం
- ప్రస్తుతం మౌలిక సదుపాయాల కల్పనకు మరో రూ.10కోట్లు అవసరం
- ప్రభుత్వ అనుమతి కోసం పది నెలలుగా ఎదురుచూపు
- ఈ విద్యాసంవత్సరంలో అందుబాటులోకి రావడం అనుమానమే
- ప్రైవేటు హాస్టళ్లలో ఉంటూ తీవ్ర ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- నిర్మాణాలు పూర్తిచేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్న కూటమి ప్రభుత్వం



యువకుల వసతిగృహం వద్ద నిలిచిపోయిన పనులు

నరసరావుపేట రూరల్: జేఎన్‌టీయూఎన్ కళాశాల విద్యార్థులకు ఈ విద్యాసంవత్సరంలోనూ వసతి గృహాలు అందుబాటులోకి వచ్చే అవకాశాలు కనిపించడం లేదు. గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన వసతి గృహాల నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్న దశలో ఎన్నికలు వచ్చాయి. ఆ తరువాత ఎక్కడిపనులు అక్కడే నిలిచిపోయాయి. గత పదినెలలుగా పనులకు జరగకపోవడంతో వసతి గృహాల నిర్మాణాల పూర్తికావడంపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

నిలిచిన వసతి గృహాల పనులు

విద్యార్థీ, విద్యార్థినుల వసతి గృహాలను దాదాపు రూ.32కోట్లతో నిర్మించేందుకు టెండర్లు పిలిచారు. మూడు అంతస్తులతో నిర్మిస్తున్న భవనాల పనులు గత ఏడాది మే నెలకు పూర్తిచేశారు. విద్యార్థుల వసతి గృహం రెండవ బ్లాక్‌లో మూడవ అంతస్తు, సెప్టిక్ ట్యాంక్ పనులు మిగిలిపోయాయి. విద్యార్థినుల వసతి గృహంలోని రెండు బ్లాక్‌లో శానిటరీ ఫిట్టింగ్ పనులు చేపట్టాల్సి ఉంది. ఇందుకు అవసరమైన అంచనాలను ఇంజినీరింగ్ విభాగం తయారు చేసి వర్సిటి అనుమతి కోసం పంపింది. అయితే ఇప్పటివరకు ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ నుంచి అనుమతి లభించలేదు.

విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు

కళాశాలలో సీఎస్ఈ, ఈసీఈ, సివిల్, మెకానికల్, ఈఈఈ బ్రాంచ్‌లలో విద్యాబోధన జరుగుతుంది. ఒక్కో బ్రాంచ్‌కు 60 సీట్లు కేటాయించారు. ప్రతి ఏడాది 300 మంది విద్యార్థులు కళాశాలలో చేరుతున్నారు. ఇంజినీరింగ్ నాలుగు సంవత్సరాలలో 1200 మంది విద్యార్థులు ఇక్కడ చదువుకుంటున్నారు. దీంతో పాటు రెండు బ్రాంచ్‌లలో ఎంఎస్‌ను పూర్తిచేసేందుకు 120మంది విద్యార్థులు ఉన్నారు. కళాశాలలో వసతి గృహాలు లేకపోవడంతో వీరు పట్టణంలోని ప్రైవేటు హాస్టళ్లపై ఆధారపడుతున్నారు. ఇది వారిపై ఆర్థికభారంగా మారింది. దీంతో పాటు కళాశాలకు వెళ్లాలంటే రవాణా సౌకర్యం లేదు. ఆటోల మీద ఎక్కువగా విద్యార్థులు ఆధారపడుతున్నారు. ఆటోల్లో వెళుతూ ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. ఆర్టీసీ సౌకర్యం ఉన్నా మెయిన్‌రోడ్డు వరకే ఉంటుంది. అక్కడి నుంచి 1.5 కిలోమీటరు విద్యార్థులు నడిచివెళ్లాల్సి వస్తుంది.

అదే నిర్లక్ష్యం



నిలిచిపోయిన ఇంజనీరింగ్ విభాగం గెస్ట్‌హౌస్ పనులు

2016లో జేఎన్‌టీయూఎన్ కళాశాలను ప్రారంభించారు. అప్పటి టీడీపీ ప్రభుత్వం భవనాల నిర్మాణాలపై నిర్లక్ష్యం వహించింది. కళాశాలకు కాకాని వద్ద కేటాయించిన భూముల చుట్టూ ప్రహరీని కూడా ఐదేళ్లలో పూర్తిచేయలేకపోయారు. 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత భవనాల నిర్మాణాలను వేగవంతం చేశారు. కరోనా సమయంలోనూ భవన నిర్మాణాలను చేపట్టారు. అకడమిక్, అడ్మినిస్ట్రేషన్ బ్లాక్‌లు పూర్తికావడంతో విద్యార్థులకు తరగతులు ఇక్కడ నుంచే ప్రారంభమయ్యాయి. ఇదే విధంగా వసతిగృహాలు, స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణలు పూర్తిచేయాలని భావించారు. ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి పది నెలలు గడిచినా ఇప్పటికి నిర్మాణ పనులు ప్రారంభించలేదు.

నిర్మాణాలు సత్వరం పూర్తిచేయాలి



జేఎన్‌టీయూఎన్ కళాశాల విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా వసతి గృహాల నిర్మాణాలు పూర్తిచేయాలి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం భవనాల నిర్మాణం పూర్తచేసింది. మైనర్ వర్క్‌లు పూర్తిచేయడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుంది. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పందించి ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

– గుజ్జర్లపూడి ఆకాష్ కుమార్, వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు

వైఎస్సార్ సీపీ హయాంలో శరవేగంగా పనులు..

కాకానిలోని జేఎన్‌టీయూఎన్ ఇంజినీరింగ్ కళాశాలలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ కాలంలో శరవేగంగా సాగిన పనులు గత పదినెలలుగా ముందుకు సాగడం లేదు. కళాశాలలో దాదాపు రూ.150 కోట్లతో వివిధ అభివృద్ధి పనులను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టింది. అకడమిక్ బ్లాక్, అడ్మినిస్ట్రేషన్ బ్లాక్‌లతో పాటు అంతర్గత రోడ్ల నిర్మాణాలు పూర్తిచేసారు. దీంతో పాటు అంతర్జాతీయ ప్రమాణాలతో స్పోర్ట్స్ కాంప్లెక్స్, యువతీ, యువకులకు వసతి గృహాల నిర్మాణాలు ప్రారంభించింది. ఈ రెండు నిర్మాణ పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి.



తుది దశలో యువతుల వసతి గృహం

సెప్టెంబర్ కల్లా అందుబాటులోకి తెస్తాం

కళాశాల వసతి గృహాలకు సంబంధించిన మేజర్ పనులు పూర్తయ్యాయి. చిన్న చిన్న పనులు మిగిలిపోయాయి. ఇందుకు అవసరమైన అంచనాలు తయారు చేసి పంపించాం. ప్రభుత్వం మారడం, నూతనంగా వీసీ రావడం వలన కొంత ఆలస్యం జరిగింది. నూతన వీసీ సెప్టెంబర్‌కు భవనాల నిర్మాణాల పూర్తిచేయాలనే ఆలోచనతో ఉన్నారు.

– ప్రొఫెసర్ సీహెచ్ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్, జేఎన్‌టీయూఎన్ కళాశాల

క్లుప్తంగా

నరసరావుపేట రైల్వే స్టేషన్లో విస్తృత తనిఖీలు



నరసరావుపేటటౌన్: కశ్మీర్‌లోని పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో నరసరావుపేట ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు అప్రమత్తమయ్యారు. గురువారం రైల్వేస్టేషన్, పరిసరాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. స్టేషన్ పరిసరాల్లో ప్రయాణికులను క్షుణ్ణంగా తనిఖీచేశారు. శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అమరావతికి రానున్న నేపథ్యంలో పటిష్టవంతమైన భద్రతా చర్యల్లో భాగంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు జీఆర్పీ ఎస్ఐ వి.శ్రీనివాసరావు నాయక్ తెలిపారు. తనిఖీల్లో నరసరావుపేట జీఆర్పీ, ఆర్పీఎఫ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

వినుకొండ: స్థానిక వినుకొండ పట్టణంలోని హనుమాన్‌నగర్‌లోని ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల పాఠశాల (బాలుర) నందు 2025-26 విద్యాసంవత్సరానికి తరగతుల్లో ఖాళీలకు దరఖాస్తులు కోరుతున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ వై. శివరామకృష్ణ తెలిపారు. 5వ తరగతిలో ఎస్టీ-30, ఎస్సీ-5, బీసీ-2, ఓసీ-1, పీహెచ్‌సీ-1, గిరిజన ప్రాంతీయ ఉద్యోగులు -1, బ్యాక్ లాగ్ పోస్టులు (ఎస్టీ విద్యార్థులకు మాత్రమే), 6వ తరగతిలో 21, 8వ తరగతిలో 6, 9వ తరగతిలో 9 కలవు. పూర్తి చేసిన దరఖాస్తులను మే నెల 20వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు పాఠశాల కార్యాలయంలో అందజేయాలన్నారు.

ఏపీ మోడల్ స్కూల్ ఆరవ తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాలు

క్రోసూరు: క్రోసూరులోని ఏపీ మోడల్ స్కూల్ నందు ఆరవ తరగతి ప్రవేశపరీక్ష (2025-26) ఫలితాలను ప్రకటించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మేరీసుజన్ గురువారం తెలిపారు. రోస్టర్, మెరిట్ ప్రాతిపదికన సీట్లు కేటాయించి సీటు వచ్చిన విద్యార్థులకు ఫోను ద్వారా తెలియజేయనున్నట్టు చెప్పారు. ఫలితాలను పాఠశాలలోని నోటీసు బోర్డులో కూడా చూడవచ్చని పేర్కొన్నారు.

డివిజన్ పరిధిలో పలు రైళ్లు రద్దు

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో ఇంజినీరింగ్ పనులు జరుగుతున్న నేపథ్యంలో పలు రైళ్లను రద్దు చేయడం జరిగిందని డివిజన్ సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ గురువారం తెలిపారు. చర్లపల్లి-తిరుపతి(07257) ఈనెల 8వ తేదీ నుంచి 29వ తేదీ వరకు, తిరుపతి-చర్లపల్లి(07258) రైలు ఈనెల 9వ తేదీ నుంచి 30వ తేదీ వరకు రద్దు చేయడం జరిగిందన్నారు. అలాగే గుంటూరు-రేపల్లె(67249), రేపల్లె-గుంటూరు(67250) గుంటూరు-రేపల్లె(67223), రేపల్లె-గుంటూరు(67224), రేపల్లె-తెనాలి(67230), తెనాలి-రేపల్లె (67231), రేపల్లె-తెనాలి (67232), తెనాలి-రేపల్లె (67233) రేపల్లె-గుంటూరు (67234)విజయవాడ-తెనాలి(67221) రైళ్లను ఈనెల 4వ తేదీన రద్దు చేయడం జరిగిందని తెలిపారు. ప్రయాణికులు గమనించి సహకరించాల్సిందిగా తెలియజేశారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 514.210 అడుగుల వద్ద ఉంది.ఇది 138.7364 టీఎంసీలకు సమానం.

ఆడుదాం.. ఆరోగ్యంగా ఉందాం

- ప్రారంభమైన వేసవి క్రీడా సంబరం
- మారుతున్న తల్లిదండ్రుల ఆలోచనలు
- కిటకిటలాడుతున్న క్రీడా మైదానాలు
- ఆరోగ్యం కోసం క్రీడలు తప్పనిసరంటున్న నిపుణులు
- తక్కువ ఖర్చుతోనే నేర్చుకునే సౌలభ్యం



అథ్లెటిక్స్‌లో సాధన చేస్తున్న చిన్నారులు (ఫైల్)

గుంటూరు వెస్ట్ (క్రీడలు): వేసవి చిన్నారులకు ఎంతో ఇష్టం కారణం పాటశాలలకు సెలవులు. కొన్ని రోజులపాటు పుస్తకాలు, క్లాస్‌రూమ్స్ ఉండవు. ఆటలు, పాటలే ఆట విడుపుగా సెలవులను గడిపేస్తారు. ఈ క్రమంలో ప్రభుత్వం పట్టణంలో పలు ప్రాంతాల్లో మే 1వ తేదీ నుంచి నెలాఖరు వరకు వేసవి క్రీడా శిక్షణా తరగతులు ఏర్పాటు చేస్తుంది. 30 రోజులపాటు సాగే శిక్షణా శిబిరంలో నిపుణులైన శిక్షకులు, సీనియర్ క్రీడాకారుల ఆధ్వర్యంలో క్రికెట్, జిమ్నాస్టిక్స్, చెస్, బాస్కెట్‌బాల్, టెన్నిస్, కరాటే, జూడో, షటిల్ బాక్సింగ్ ఇలా 23 క్రీడా విభాగాల్లో శిక్షణా శిబిరాలు ఏర్పాటు చేసారు. ప్రపంచ నెంబర్ వన్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్, డబుల్ ఒలింపియన్ సత్తెగీత, ప్రస్తుతం ఐపీఎల్‌లో రాణిస్తున్న ఎందరో క్రీడాకారులు వేసవి శిక్షణా శిబిరాల ద్వారానే వెలుగులోకి వచ్చారు.

బీఆర్ స్టేడియంలో...

స్థానిక బీఆర్ స్టేడియంలో జిమ్నాస్టిక్స్, అథ్లెటిక్స్, టెన్నిస్, స్కేటింగ్, ఫెన్సింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, కరాటే, జూడో లాంటి క్రీడల్లో శిక్షణా శిబిరాలు ఏర్పాటు చేసారు. వీటిలో టెన్నిస్‌కు రూ.500, బ్యాడ్మింటన్‌కు రూ.500, స్కేటింగ్‌కు రూ.300 వసూలు చేస్తున్నారు. మిగతా అన్ని క్రీడలను ఉచితంగానే శిక్షణనిస్తారు.



జిమ్నాస్టిక్స్‌లో సాధన చేస్తున్న చిన్నారి (ఫైల్)

సమయం ఉదయం 6 నుంచి 8 గంటల వరకు సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు ఉంటుంది.

ఎన్టీఆర్ స్టేడియంలో..

అథ్లెటిక్స్ లాంగ్ టెన్నిస్, షటిల్, స్కేటింగ్, బాస్కెట్ బాల్, స్విమ్మింగ్, యోగా, చెస్‌లో శిక్షణ ఉంటుంది. స్విమ్మింగ్‌కు రూ.2200, అథ్లెటిక్స్‌కు రూ.1200, బ్యాడ్మింటన్, స్కేటింగ్‌లకు రూ.1600 చొప్పున ఒక్క నెలకు వసూలు చేస్తున్నారు. నిపుణుల పర్యవేక్షణలో శిక్షణనిస్తామని నిర్వాహకులు చెబుతున్నారు.

క్రీడలు జీవితంలో తప్పనిసరి



ప్రస్తుత ఆధునిక సమాజంలో చిన్నారులను మానసికంగా, శారీరకంగా ధృఢంగా ఉంచడానికి క్రీడలు తప్పనిసరి. క్రీడా సాధనతో చిన్నారుల కండరాలు, నరాలు గట్టిపడతాయి. చక్కని హార్మోన్స్ విడుదలకు దోహదపడతాయి. క్రీడా సాధన చేసే పిల్లల భవిష్యత్తు ఆరోగ్యకరంగా ఉంటుంది. షుగర్, బీపీ, ఒత్తిడి దరిచేరవు. శారీరక శ్రమ లేకపోవడంతోనే బాల్యంలోనే అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. తల్లిదండ్రులు పిల్లలకు ఆస్తితోపాటు చక్కని ఆరోగ్యం ఇచ్చేందుకు ప్రయత్నించాలి.

– డాక్టర్ కె.సుబ్బారావు, ఎండో క్రైనాలజిస్ట్

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి



దాదాపు 2500 మంది చిన్నారులను 50 బ్యాచ్‌లుగా విడగొట్టి వారికి కావాల్సిన వాటిలో శిక్షణనిస్తున్నాం. కొన్ని క్రీడలకు నామమాత్రపు రుసుము వసూలు చేయగా మరికొన్ని ఉచితంగా అందిస్తున్నాం. శిక్షణా శిబిరాల్లో ప్రతిభ కనబరచే వారిని ఎంపిక చేసి ప్రొఫెషనల్ స్థాయికి వచ్చే విధంగా తర్ఫీదునిస్తాం. చిన్నారుల ఆరోగ్య స్థితిగతుల బట్టి వారికి ఇష్టమైన క్రీడలోనే చేర్చాలి. పిల్లల శిక్షణ సమయంలో అన్ని జాగ్రత్తలు తీసుకుంటాం. శాప్ కూడా ప్రతి క్రీడ నిర్వహణకు రూ.7000 చొప్పున కేటాయించింది. ఎంతమంది పిల్లలు వచ్చినా శిక్షణనిస్తాం.

– నరసింహారెడ్డి, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి

క్రమశిక్షణ అలవడుతుంది..



పిల్లలు ఇంట్లో ఉంటే ఫోన్లు చూసుకోవడం, అల్లరి చేయడం చేస్తుంటారు. అందుకే నా పిల్లలకు చిన్నప్పటి నుంచే క్రీడల్లో శిక్షణనిప్పిస్తే వారికి ఆరోగ్యంతోపాటు, చక్కని క్రమశిక్షణ అలవడుతుంది. నా ఇద్దరి ఆడపిల్లల్ని చెరో క్రీడల్లో చేర్పించాను. వారితోపాటు నేను నా భార్య కూడా వాకింగ్‌లాంటివి చేస్తున్నాం. వేసవి క్రీడా శిక్షణ మాకు బాగా ఉపయోగపడుతుంది.

– ఎండీ ఎజాద్దీన్, ఆసిఫానాజ్ దంపతులు

నా మనవడు ఆరోగ్యంగా ఉండాలని..



నేను గడచిన 55 ఏళ్ల నుంచి బీఆర్ స్టేడియంలో బాస్కెట్ బాల్ ఆడుతున్నాను. ఇప్పటికీ ఎంతో ఆరోగ్యంగా ఉండడానికి క్రీడా సాధనే కారణం. నా పిల్లలు వారి ఉద్యోగాల్లో బిజీగా ఉంటున్నారు. అందుకే నా మనవడు జయరాజ్‌ను వేసవి శిబిరంలో చేర్పించాను. వాడితోపాటు నేను వస్తున్నాను. నా మనవడు ఆరోగ్యంగా ఉండేందుకు క్రీడా సాధన ముఖ్యమని నా అభిప్రాయం.

–మురళీకృష్ణ, సీనియర్ బాస్కెట్ బాల్ ప్లేయర్

నాన్నను ఒప్పించి చేరాను



నాకు టెన్నిస్ అంటే చాలా ఇష్టం. ప్రతి రోజూ స్కూల్ కారణంగా ఆడే అవకాశం లేదు. ఇప్పుడు సెలవులు వచ్చాయి. నాన్నను ఒప్పించి శిబిరంలో చేరాను. ఈ నెల రోజులు టెన్నిస్ నేర్చుకుంటాను. ఇక్కడ చాలా మంది పిల్లలున్నారు. వారందరితో ఆడడం అంటే భలే సరదా.

– కుమార్తె ధ్యాన భువనతో తండ్రి సుబ్రహ్మణ్యం

జానపాడు రైల్వే బ్రిడ్జి నిర్మాణం చేపట్టకపోతే కోర్టును ఆశ్రయిస్తాం

గురజాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



మాట్లాడుతున్న గురజాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: జానపాడు రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టకపోతే కోర్టును ఆశ్రయిస్తామని, నిర్మాణం చేపట్టే వరకు పోరాటాలు ఆగవని గురజాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పిడుగురాళ్ల పట్టణంలోని జానపాడు రోడ్డులో రైల్వే బ్రిడ్జి నిర్మాణం కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో కేంద్ర ప్రభుత్వం రూ. 52 కోట్ల నిధులను మంజూరు చేసిందని తెలిపారు. గత ఎన్నికల ముందు నిర్మాణానికి శంకుస్థాపన చేశామని తెలిపారు. కూటమి ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణ పనులు ఇంత వరకు ప్రారంభించలేదని అన్నారు. బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించకపోతే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటాలు చేస్తుందని అధికార పార్టీకి అల్టిమేటం చేశామని, అయినా అధికార పార్టీ నాయకులు మొద్దు నిద్ర వీడలేదని విమర్శించారు. అందుకే జానపాడు రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించకపోతే కోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు. ప్రజా ప్రయోజనాల కోసం గత వైఎస్సార్ సీపీ హయాంలో మంజూరు చేసిన బ్రిడ్జిని ఎందుకు నిర్మించరూ, పూర్తి బడ్జెట్ కేంద్ర ప్రభుత్వం కేటాయించినా, ఎందుకు నిర్మించటం లేదని కోర్టులో పిల్ దాఖలు చేయటం జరుగుతుందన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ధర్నాలు చేస్తాం, అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాలు వంటివి చేపడతామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ కన్వీనర్ చింతా వెంకట రామారావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర వైద్యుల విభాగ అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్, రాష్ట్ర మాజీ ఆర్టీఐ మాజీ కమిషనర్ రేపాల శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ పల్నాడు జిల్లా అధ్యక్షులు వీరభద్రుని రామిరెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ చింతా సుబ్బారెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు కత్తెరవు వాసుదేవరెడ్డి, కాంద్రగుంట శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జూనియర్స్ విభాగం విజేత హైదరాబాద్ ఎడ్లజత



ఎడ్ల బలప్రదర్శన పోటీలో బండలాగుతున్న ఎడ్లజత



విజేత ఎడ్ల జత రైతుకు బహుమతి, నగదు అందజేస్తున్న దాతలు

దాచేపల్లి: స్థానిక శ్రీ వీర్ల అంకమ్మతల్లి కొలుపుల తిరునాళ్ల సందర్భంగా నిర్వహిస్తున్న రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు బుధవారం రాత్రి హోరాహోరీగా జరిగాయి. జూనియర్స్ విభాగంలో జరిగిన ఈ పోటీలను గురజాల శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు ప్రత్యేకంగా పూజలు చేసి ప్రారంభించారు. పోటీలో హైదరాబాద్‌కి చెందిన డి.రోహన్‌భాబు ఎడ్ల జత 3,158 అడుగుల దూరం బండ లాగి విజేతగా నిలిచింది. బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలేనికి చెందిన అత్తోట శిరిష చౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్ల జత 2,772 అడుగుల దూరం బండలాగి రెండవ స్థానం, గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కుంచనపల్లికి చెందిన బుర్రిముక్కు కౌసల్యారెడ్డి ఎడ్ల జత 2,565 అడుగుల దూరం బండలాగి మూడో స్థానం, గుంటూరు జిల్లా గుంటూరు రూరల్ మండలం లింగయపాలెంకి చెందిన యల్లం సాంబశివరావు ఎడ్ల జత 2,398 అడుగుల దూరం బండలాగి నాల్గవ స్థానం, బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెంకి చెందిన అత్తోట శిరిషచౌదరి, శివకృష్ణ చౌదరి, గుంటూరు జిల్లా కాకుమాను మండలం గార్లపాడుకి చెందిన దొడ్డంపూడి గణేష్ సంయుక్త ఎడ్ల జత 2,250 అడుగుల దూరం బండలాగి ఐదో స్థానం, గుంటూరు జిల్లా గుంటూరు రూరల్ మండలం లింగాయపాలెంకి చెందిన యల్లం సాంబశివరావు ఎడ్లజత 2వేల అడుగుల దూరం బండ లాగి ఆరో స్థానం, గుంటూరు పట్టణానికి చెందిన సోమిశెట్టి ఆంజనేయులు ఎడ్ల జత 1,774 అడుగులు దూరం బండలాగి ఏడవ స్థానంలో నిలిచాయి. విజేతలైన ఎడ్ల జతల రైతులకు దాతలు నగదు, షీల్డ్స్ బహుకరించారు. పోటీలకు న్యాయనిర్ణేతగా గూడా శ్రీనివాసరావు వ్యవహరించగా కమిటీ సభ్యులు కొప్పుల గిరి, అనిశెట్టి శ్రీనివాసరావు, కానుకొల్లు ప్రశాంత్, మునగా నిమ్మయ్య తదితరులు పర్యవేక్షించారు.

అప్పల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

పుసులూరు(కాకుమాను): అప్పుల బాధతో కౌలురైతు పురుగు మందుతాగి గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు పెదనందిపాడు మండలం పుసులూరుకు చెందిన తమటం బసవయ్య గత కొంత కాలంగా పొలం కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. ఈ ఏడాది 20 ఎకరాలు తీసుకుని మిరప, మొక్కజొన్న, శనగ, పత్తి సాగు చేపట్టాడు. అన్ని పంటలు ఆశించిన స్థాయిలో పండకపోవడం, సరైన గిట్టుబాటు ధరలు లేకపోవడంతో సాగుకు చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక రోజు మదన పడుతుండేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. బుధవారం భార్యను వెంటపెట్టుకుని పొలం వద్దకు వెళ్లాడు. అనంతరం చిన్న ఫంక్షన్ ఉందని సాయంత్రానికి ఇంటికి వస్తానని చెప్పి గుంటూరు వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో ఫోన్ చేసినా స్పందన లేకపోవంతో పంట పొలాల్లో వెతికారు. గురువారం ఉదయం పుసులూరు నుంచి కట్రపాడు వెళ్లే మార్గంలో ఓ పంట పొలంలో బసవయ్య నిర్జీవంగా పడి ఉన్నట్లు మృతుని భార్య తెలిపింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

సుకుందరావును పరామర్శించిన నాయకులు



మార్టూరులో సుకుందరావును పరామర్శిస్తున్న నాయకులు

మార్టూరు: పోలీస్ స్టేషన్లో తనకు న్యాయం జరగలేదంటూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మార్టూరు మండల వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ కన్వీనర్ అట్లూరి సుకుందరావును గురువారం పార్టీ నాయకులు ఆయన నివాసంలో కలిసి పరామర్శించి తమ సంఘీభావం తెలిపారు. సుకుందరావును కలిసిన వారిలో మండల పార్టీ కన్వీనర్ జంపని వీరయ్య చౌదరి, ఎస్టీ సెల్ నాయకులు బాబు నాయక్, మోషే నాయక్ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి ఉచిత సీట్లకు దరఖాస్తు చేసుకోండి

డీఈఓ చంద్రకళ

నరసరావుపేట ఈస్ట్: విద్యాహక్కు చట్టం ద్వారా 2025-26 విద్యా సంవత్సరానికిగాను ప్రైవేటు పాఠశాలల్లో పేద పిల్లలకు 25 శాతం 1వ తరగతిలో ఉచిత ప్రవేశాలకు ఈనెల 2వ తేదీ నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన చిన్నారుల తల్లిదండ్రులు ఈనెల 19వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. దరఖాస్తులను తమ సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయాలు, మండల, జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం, మీసేవ, ఇంటర్నెట్ సెంటర్ల నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. htt pr://crea pgov.in/ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తును అప్‌లోడ్ చేయవచ్చని తెలిపారు. విద్యార్థుల వయస్సు 5 నుంచి 6 సంవత్సరాలలోపు ఉండాలన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.2లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.44లక్షలకు మించకూడదని తెలిపారు. వివరాలకు సమీపంలో ఎంఈఓ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరం



వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులతో ఝాన్సీలక్ష్మి, సిబ్బంది

గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా నిర్వహించిన శిక్షణా తరగతుల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఉప గ్రంథ పాలకురాలు కె.ఝాన్సీలక్ష్మి పర్యవేక్షణలో విద్యార్థులకు కథలు చదవటం, కథలు వినడం, మ్యాథ్స్ క్లాస్, స్పోకెన్ ఇంగ్లీష్, దేశభక్తి గీతాల పోటీలను నిర్వహించారు. ఈసందర్భంగా ఝాన్సీలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు రోజూ గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం, గ్రామర్, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, పెయింటింగ్, పప్పెట్ మేకింగ్, పేపర్ క్రాఫ్ట్ నేర్చుకోవాలని కోరారు. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా గ్రంథాలయాల్లో నిర్వహించే శిక్షణా కార్యక్రమాలకు పంపాలని సూచించారు. గ్రంథ పాలకులు కె.చిన్నపరెడ్డి, ఎస్.నాగిరెడ్డి, శాంతి భాయి, వంశీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

జర్మనీలో నర్సింగ్ ఉద్యోగాలు

గుంటూరు నర్సింగ్ కాలేజీలో ఉచిత శిక్షణ

గుటూరు మెడికల్: నర్సింగ్ సిబ్బంది గతంలో జర్మనీ వెళ్లాలంటే ఏం చేయాలో, ఎక్కడ శిక్షణ తీసుకోవాలో, ఎవరిని సంప్రదించాలో తెలియక చాలామంది ఇబ్బంది పడేవారు. రాష్ట్ర ప్రభుత్వం నర్సింగ్ విద్యార్థులకు శిక్షణ ఇప్పించి జర్మనీలో ఉద్యోగాలు పొందేలా ఏర్పాట్లు చేసింది. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గుంటూరు ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో మొదటి బ్యాచ్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. నర్సులకు శిక్షణ ఇవ్వడానికి ఒక ప్రైవేటు సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నారు. గుంటూరు ప్రభుత్వ నర్సింగ్ కళాశాలను శిక్షణ కేంద్రంగా ఎంపిక చేశారు. రాత, మౌఖిక పరీక్షల ద్వారా కోస్తాంధ్ర ప్రాంతం నుంచి 22 మందిని ఎంపిక చేశారు. గత ఏడాది డిసెంబర్ 11 నుంచి శిక్షణ ప్రారంభమైంది. శిక్షణలో జర్మన్ భాషలో ఏ1, ఏ2, బీ1, బీ2 స్థాయిలలో నైపుణ్యం సాధించాలి. ఇప్పటికే ఏ1, ఏ2, బీ1 పరీక్షలు పూర్తికాగా.. వారికి చెన్నైలో బీ2 పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారికి ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ లో మౌఖిక పరీక్ష ఉంటుంది. దీనిలో ఉత్తీర్ణత సాధిస్తే జర్మనీలో ఉద్యోగానికి ఎంపికైనట్లు లెక్క. అలా ఎంపికైనా వారికి విమాన టికెట్లు, వీసా, ధ్రువపత్రాలు అన్నీ ఉచితంగా అందిస్తారు. వీరికి నెలకు రూ.2.7 లక్షల నుంచి రూ.3.2 లక్షల వరకు జీతం ఇస్తారు. రాష్ట్ర ప్రభుత్వం శిక్షణ ఇచ్చి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారిని జర్మనీ పంపేందుకు ఏర్పాట్లు చేయడం ఆనందంగా ఉందని గుంటూరు ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో శిక్షణ తీసుకుంటున్నవారు చెబుతున్నారు. విదేశాల్లో నర్సులుగా ఉద్యోగాల కోసం వెళ్లేందుకు ఇది సువర్ణ అవకాశం అంటున్నారు.

కల్లంలోని మిర్చి చోరీ

సుమారుగా 15 క్వింటాళ్ల మిర్చి మాయం



దొంగతనం జరిగిన కల్లం

మేడికొండూరు: రైతులు ఆరుగాలం చెమటోడ్చి పండించిన పంట దిగుబడులను గుర్తు తెలియని వ్యక్తులు దోచుకెళ్లిన ఘటన మేడికొండూరు మండలం సిరిపురం గ్రామంలో జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం .. వెలనాటి శ్రీనివాసరావు అనే రైతు తన పొలంలో సుమారు 40 క్వింటాళ్ల మిరప పంటను కోసి కల్లాల్లో ఆరబోశాడు. ఎండిన మిర్చిని టిక్కీలలో నింపేందుకు ఒక రాశిగా చేశాడు. బుధవారం రాత్రి మిర్చి రాశిలోని సుమారు 15 క్వింటాళ్ల కాయలు దొంగలు టిక్కీలలో నింపుకొని వెళ్లినట్లు రైతు శ్రీనివాసరావు తెలిపారు. మిర్చి దొంగతనంపై మేడికొండూరు పోలీసులకు ఫిర్యాదు చేస్తామని రైతు తెలిపారు. గతంలో ఇదే తరహాలో మండలంలోని డోకిపర్రు గ్రామంలో కల్లాల్లో ఉన్న మిర్చి దొంగతనం జరిగిందని రైతు తెలిపాడు. ఇప్పటికైనా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి మిర్చి దొంగలను నియంత్రించాలని మండల రైతులు కోరుతున్నారు.